సాక్షి
కామారెడ్డి
గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



సొంతింటి కల నెరవేర్చాలి
గృహలక్ష్మితో పేదల సొంతింటి కల సాకారమవుతోందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.
- 9లో ▸



తప్పని తిప్పలు
వంతెనల నిర్మాణం కోసం వేసిన తాత్కాలిక రోడ్లు కొట్టుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.0 /22.6
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

‘కాయితీ’ల పోరుబాట!

ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో కాయితీ లంబాడీలు పోరుబాట పట్టారు. రిజర్వేషన్ల కోసం ఆందోళనలు చేసినా, సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రి కేటీఆర్‌ను పలుమార్లు కలిసి విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఏకంగా సీఎంపైనే పోటీకి సిద్ధమవుతున్నారు.

– సాక్షి, కామారెడ్డి



కామారెడ్డి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కాయితీ లంబాడీలు (ఫైల్)

- ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏళ్లుగా డిమాండ్
- రిజర్వేషన్ లేక నష్టపోతున్న గిరిజనులు
- సీఎం మీద పోటీకి సిద్ధమవుతున్న కాయితీ లంబాడీలు
- 1,016 నామినేషన్లు వేస్తామని ప్రకటన

కాయితీ లంబాడీను లబాన్, మధుర, జుట్టు, కొప్పు.. ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు. అటవీ ప్రాంతంలోనే నివసించే ఈ లంబాడీలు.. పశుపోషణతో పాటు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో ముఖ్యంగా మహిళల వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి. కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో 19 వేలపైచిలుకు కాయితీ లంబాడీల కుటుంబాలు ఉన్నాయని అంచనా.. కామారెడ్డి జిల్లాలోని గాంధారి, పిట్లం, లింగంపేట, బిచ్కుంద, బాన్సువాడ మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని వర్ని, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలోని కంగ్టి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని బోథ్, ఉట్నూరు, నిర్మల్ తదితర మండలాల్లో కాయితీ లంబాడీ కుటుంబాలు ఉన్నాయి. దాదాపు అన్నిచోట్ల పోడు సేద్యం చేసుకుంటున్నారు. గతంలో ఎస్టీ జాబితాలోనే ఉన్న వీరు 1986లో బీసీ–డీ జాబితాలోకి మారారు. అప్పటినుంచి తమను తిరిగి ఎస్టీ జాబితాలో చేర్చాలని వీరు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. బీసీ జాబితాలో చేర్చడంతో విద్య, ఉద్యోగాలలో అవకాశాలను కోల్పోయి, ఇప్పటికీ వెనకబడే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో పర్యటించినప్పుడు కాయితీ లంబాడీలు ఆయనను కలిసి సమస్యను విన్నవించారు. దీంతో ఆయన రిజర్వేషన్ అంశాన్ని పరిశీలించమంటూ అధికారులను ఆదేశించారు. అప్పట్లో దీనిపై చర్చ జరిగింది. వైఎస్సార్ అకాల మరణంతో సమస్య అలాగే ఉండిపోయింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ వాల్మీకి, బోయలతో పాటు కాయితీ లంబాడీల రిజర్వేషన్ అంశంపై చల్లప్ప కమిషన్ ద్వారా విచారణ జరిపించారు. చెల్లప్ప కమిషన్ గాంధారి, పిట్లం తదితర మండలాల్లో పర్యటించింది. ఆ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా

చెల్లప్ప కమిషన్ విచారణ...

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ కేంద్రానికి పంపింది. అయితే తీర్మానంలో సవరణలు చేసి పంపాలంటూ కేంద్రం కోరింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. సమస్య పరిష్కరించాలని కోరుతూ కాయితీ లంబాడీ నాయకులు పలుమార్లురాష్ట ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసినా ఫలితం లేదు.

పోడు పట్టాలకు రిజర్వేషనే సమస్య

కాయితీ లంబాడీలు వేలాది ఎకరాల్లో పోడు భూములు సాగు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేసింది. కాయితీలు ఎస్టీ జాబితాలో లేకపోవడం వారికి శాపంగా మారింది. వేలాది ఎకరాల్లో పోడు భూములు సాగు చేసుకుంటున్న కాయితీలు తమకు పట్టాలు ఇవ్వాలని డిమండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండ్‌తో పెద్ద ఎత్తున ఉద్యమం లేవదీస్తామని హెచ్చరిస్తున్నారు. ఇటీవల గాంధారి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. త్వరలో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, సభ నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొంటున్నారు.

రిజర్వేషన్ ఇవ్వకపోతే..



ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏళ్లుగా కోరుతున్నాం. సీఎం కేసీఆర్ కూడా హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో కామారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహిస్తాం. రిజర్వేషన్ కల్పించకపోతే సీఎం మీద 1,016 మందితో నామినేషన్లు వేయించి, కొట్లాడుతం.

– తానొసింగ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు, లబానా లంబాడీల సంఘం

నష్టపోతున్నం



తండాలలో జీవించే మాకు ఎస్టీ రిజర్వేషన్ లేకపోవడంతో మా పిల్లలు అనేక రకాలుగా నష్టపోతున్నారు. చదువుతో పాటు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు దొరకడం లేదు. ఎస్టీ జాబితాలో చేర్చితే మాకు ఎంతో మేలు జరిగేది. ప్రభుత్వం న్యాయం చేయాలి.

– బంతీలాల్, జిల్లా అధ్యక్షుడు

పోడు పట్టాలివ్వాలి



తాతల కాలం నుంచి పోడు భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్నం. మాకు ఎస్టీ రిజర్వేషన్ లేక చాలా అన్యాయం జరిగింది. రిజర్వేషన్ వర్తింపజేసి, పోడు పట్టాలివ్వాలి. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం

– బిషన్ నాయక్, సంఘం నాయకుడు

ఏళ్లుగా కొట్లాడుతున్నం



1986 వరకు ఎస్టీ జాబితాలోనే ఉండేవాళ్లం. తర్వాత బీసీలో చేర్చి అన్యాయం చేశారు. దీనిపై ఏళ్లుగా కొట్లాడుతున్నా పరిష్కారం మాత్రం దొరకడం లేదు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం జేస్తం.

– మురారి, జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

బీజేపీ టికెట్టు కోసం దరఖాస్తు

సాక్షి, కామారెడ్డి: బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆ పార్టీ టికెట్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి దరఖాస్తును సమర్పించారు.

ప్రీసిట్టింగ్ లోక్‌అదాలత్‌లో 2,377 కేసుల పరిష్కారం



కామారెడ్డి టౌన్: జిల్లాలోని కోర్టులలో బుధవారం నిర్వహించిన ప్రీసిట్టింగ్ లోక్ అదాలత్‌లో 2,377 కేసులకు పరిష్కారం లభించిందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి తెలిపారు. కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద కోర్టులలో కాంపౌండబుల్, క్రిమినల్, మెయింటినెన్స్ కేసులకు పరిష్కారం చూపామన్నారు. కామారెడ్డిలో 100, బాన్సువాడలో 800, బిచ్కుందలో 1,477 కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. అలాగే ఈనెల 9న జిల్లాలోని కోర్టులలో నిర్వహించిన లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు సూచించారు. లోక్‌అదాలత్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అశోక్, రాజగోపాల్‌గౌడ్, సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, న్యాయవాదులు లక్ష్మీనర్సింహారెడ్డి, శ్రీనివాస్, లైజన్ ఆఫీసర్లు విఠల్, హన్మండ్లు, కోర్టు సిబ్బంది సంధ్య పాల్గొన్నారు.

13నుంచి సదరం క్యాంపులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపులను ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌డీవో సాయన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ నెలలో 13, 14, 20, 21 తేదీలలో శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అక్టోబర్‌లో 4, 5, 18, 19 తేదీలలో, నవంబర్‌లో 1, 2, 22, 23 తేదీలలో క్యాంపులు ఉంటాయని తెలిపారు. దివ్యాంగులు ఈనెల 9వ తేదీ నుంచి మీ సేవ కేంద్రాలలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

‘ఓటరుగా నమోదు చేయించాలి’




మద్నూర్: అర్హత గల వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలని అదనపు కలెక్టర్ మను చౌదరి సూచించారు. మద్నూర్ తహసీల్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పద్దెనిమిదేళ్లు నిండినవారికి అవగాహన కల్పించి, ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. పోలింగ్ బూత్‌ల నిర్వహణ, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను ఓటర్లకు వివరించాలన్నారు.

గురుకులాల్లో టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి క్రైం: జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి బాలికల పాఠశాల/జూనియర్ కళాశాలలో జువాలజీ, కెమిస్ట్రీ, బోటని, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బాన్సువాడ బాలుర పాఠశాల/జూనియర్ కళాశాలలో కామర్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులలో ఒక్కో పోస్టు ఉన్నాయని తెలిపారు. ఆయా సబ్జెక్టులలో పీజీలో 50 శాతం మార్కులు సాధించి, బీఈడీ పూర్తి చేసి టెట్‌లో ఉత్తీర్ణులైనవారు ఈనెల 13 లోగా మెదక్‌లోని మినీ గురుకులంలోగల ఆర్‌సీవో కార్యాలయంలో(కోర్టురోడ్డు)లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. బాలికల పాఠశాలల్లో మహిళలకు మాత్రమే అర్హత ఉంటుందని తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత



నిజాంసాగర్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న డిమాండ్‌తో ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. బుధవారం నిజాంసాగర్, జుక్కల్ మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈనెల 10 లోపు తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. లేకుంటే సమ్మెలో పాల్గొంటామని పేర్కొన్నారు.

సీఎంతో సమావేశం.. ఇప్పట్లో లేనట్లే!

- బీఆర్‌ఎస్ నేతలకు సంకేతాలు
- త్వరలో కామారెడ్డిలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీచేస్తారన్న ప్రకటనతో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఇదే సమయంలో పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయడానికి ప్రగతిభవన్‌కు రావాలంటూ నియోజకర్గంలోని ముఖ్య నేతలకు పార్టీ అధిష్టానంనుంచి పిలుపువచ్చింది. ఈనెల 7న సమావేశం ఉంటుందని భావించారు. అయితే నియోజకవర్గంలో కార్యకర్తల సమావేశాల తర్వాతే ముఖ్య నేతలతో సీఎం సమావేశమవుతారని తెలుస్తోంది. దీంతో సీఎంతో సమావేశం కోసం బీఆర్ఎస్ నేతలు మరికొద్ది రోజులు ఆగాల్సిందేనన్న సంకేతాలు వచ్చాయి. కాగా ఈ నెల 3న హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తనయుడి వివాహానికి హాజరైన సీఎం.. గంటన్నర పాటు అక్కడే గడిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఫొటోలు దిగేందుకు సమయం ఇవ్వడంతో శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.

వందలాది మంది నేతలు, కార్యకర్తలు సీఎంతో ఫొటోలు దిగారు. గంప గోవర్ధన్ తన తనయుడి పెళ్లి కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో నియోజకవర్గంలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఒకటిరెండు రోజుల్లో ఆయన నియోజకవర్గానికి చేరుకుంటారని, తర్వాత అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలతో పాటు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తారని తెలుస్తోంది.

శ్రేణులను సమన్వయం చేయనున్న కవిత

కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఎమ్మెల్సీ కవిత కార్యాచరణ రూపొందించారు. మొదట భిక్కనూరు మండల కేంద్రంలో సభ నిర్వహించాలని నిర్ణయించినా.. ఆఖరు నిమిషంలో రద్దు చేశారు. అయితే నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆమె యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కవిత పర్యవేక్షణలో పార్టీ కార్యక్రమాలు జరుగుతాయని భావిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమాల్లో కవిత పాల్గొని పార్టీ నేతలు, శ్రేణులను సమన్వయం చేయనున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో కవిత సమావేశం తర్వాతే సీఎంతో సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మంజీర నదిలో వరద పరవళ్లు



మంజీర నదిలో వరదనీటి ప్రవాహం

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో మంజీర నది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. చెరువులు, కుంటలు అలుగెళ్లడంతో పాటు సింగితం రిజర్వాయర్, నల్లవాగు మత్తడి పొంగి పొర్లుతుండడం, నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం 42 వేల క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో ప్రాజెక్టు 5 గేట్ల ద్వారా 42 వేల క్యూసెక్కులను మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

పొంగుతున్న సింగితం, నల్లవాగు

నిజాంసాగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి 2,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. రిజర్వాయర్ నిండుకుండలా ఉండడంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీరు రిజర్వాయర్ అలుగుపై నుంచి పొంగి పొర్లుతోంది.

అలాగే మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి శివారులోగల నల్లవాగు మత్తడికి వరద ఉధృతి కొనసాగుతోంది. మత్తడికి 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతే నీరు మత్తడిపైనుంచి దిగువకు ప్రవహిస్తోంది.

‘వచ్చేనెల 4న తుది ఓటరు జాబితా’



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: తుది ఓటరు జాబితాను వచ్చేనెల 4వ తేదీన విడుదల చేస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, సవరణలు, తొలగింపులకు సంబంధించి చేపట్టిన స్పెషల్ డ్రైవ్, స్వీప్ కార్యక్రమానికి చక్కని స్పందన లభించిందన్నారు. జూలై నుంచి ఈనెల 5వ తేదీ వరకు చేపట్టిన విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా ఓటరు నమోదుకు 12,366, మార్పులు, చేర్పులకు సంబంధించి 3,160, తొలగింపులకు సంబంధించి 752 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. ఈనెల 19 నాటికి ఓటరు నమోదుకు సంబంధించి పెండింగులో ఉన్న 10,814 దరఖాస్తులతో పాటు 3,558 ఇతర 7, 8 ఫారాల దరఖాస్తుల విచారణ పూర్తి చేస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం జాబితా సవరణలను పరిశీలించి అవసరమైన సహకారం అందించాలని కోరారు. రాబోయే ఎన్నికలకు అక్టోబర్ 4న ప్రకటించే తుది ఓటర్ల జాబితానే ప్రామాణికమన్నారు. ఈనెల 19 వరకు మాత్రమే ఓటరు నమోదుకు అవకాశం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు అనిల్ కుమార్, బాలరాజు, కాశీం అలీ, మదన్‌లాల్ జాదవ్, మహమ్మద్ జఫ్ఫార్ ఖాన్, మహమ్మద్ ఫయాజ్, వెంకట్ గౌడ్, ఎన్నికల పర్యవేక్షకుడు అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఇందిర ప్రియదర్శిని పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

కామారెడ్డి క్రైం: అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల మన్ననలను పొందుతారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. పదోన్నతిపై హైదరాబాద్‌కు వెళ్తున్న జిల్లా సహకార అధికారి వసంతను బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసంత అన్ని శాఖల ఉద్యోగులతో సమన్వయంతో పని చేసి, ధాన్యం కొనుగోళ్లలో కీలకపాత్ర పోషించారన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా వచ్చిన నవీన్, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిగా వచ్చిన బావయ్యలను ఆహ్వానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, సీపీవో రాజారాం, జిల్లా అధికారులు భాగ్యలక్ష్మి, సతీష్ యాదవ్, సింహారావు, అభిషేక్ సింగ్, మల్లికార్జున్ బాబు, రమ్య, రజిత, సాయిబాబా, వరదారెడ్డి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో అప్రమత్తం!

- ఎన్నికలు సమీపిస్తుండడంతో పోలీసుల ప్రత్యేక దృష్టి
- సరిహద్దు జిల్లాలు, రాష్ట్రాల అధికారులతో సమీక్షలు



బిచ్కుందలో సమావేశమైన మూడు రాష్ట్రాల పోలీసు అధికారులు

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ వెలువడే అవకాశాలున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసు అధికారులు జిల్లా, రాష్ట్ర సరిహద్దులపై దృష్టి సారించారు. కామారెడ్డి జిల్లాకు భౌగోళికంగా కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దు ప్రాంతాలతోపాటు నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలతో సంబంధాలుంటాయి. ప్రజలు ఆయా ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సరిహద్దు ప్రాంతాలలో నేరాలు, నేరస్తులు, అక్రమ దందాలపై పోలీసులు దృష్టి సారించారు. అందులో భాగంగా పొరుగున ఉన్న సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలోని సరిహద్దు ప్రాంతాల పోలీసు అధికారులతో సమావేశమై సరిహద్దుల్లో ఎలా సహకరించుకోవాలన్న దానిపై చర్చించారు. అలాగే బిచ్కుంద సర్కిల్ పరిధిలో మద్నూర్, జుక్కల్ ప్రాంతాలకు ఇటు మహారాష్ట్ర, అటు కర్ణాటక తో సరిహద్దులు ఉండడంతో ఆయా రాష్ట్రాలకు చెందిన సరిహద్దు ప్రాంతాల పోలీసు అధికారులతో జిల్లాకు చెందిన పోలీసు అధికారులు సమావేశమయ్యారు. కామారెడ్డి సర్కిల్ పరిధిలో మాచారెడ్డి మండలానికి సరిహద్దుల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట తదితర మండలాలలు ఉంటాయి. ఆయా ప్రాంతాల పోలీసు అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించే అవకాశాలున్నాయి. సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ మద్యం రవాణాను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లాల సరిహద్దుల్లోనూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల రాష్ట్ర పోలీసు శాఖ నిఘా విభాగం ఉన్నతాధికారి ఒకరు జిల్లాలో పర్యటించి రాజకీయ పరిస్థితులు, రాజకీయ వైషమ్యాలు తలెత్తే పరిస్థితుల గురించి ఆరా తీసినట్టు తెలిసింది.

షెడ్యూల్‌కు ముందే సన్నద్ధం

ఎన్నికల షెడ్యూల్ ఇంకా వెలువడనప్పటికీ పోలీసు శాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకుంటోంది. సొంత జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులను ఇప్పటికే ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. అలాగే మూడేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కలిగించారు. బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలన్నింటినీ రూపొందించుకుని ఎన్నికల నిర్వహణకు ఎవరి సేవలు ఎలా వినియోగించుకోవాలన్న దానిపై కసరత్తు చేశారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మూడు సబ్ డివిజన్లలో పోలింగ్ కేంద్రాలు, అక్కడి పరిస్థితులు, రాజకీయ కార్యకలాపాల గురించి పోలీసు శాఖ ఇప్పటికే నివేదికలు రూపొందించింది. ఒకవైపు ఎన్నికల నిర్వహణలో పోలీసుల బాధ్యతలపై సన్నద్ధమవుతూనే మరోవైపు నేరాల నియంత్రణపైనా దృష్టి సారించారు.

సమస్యాత్మక ప్రాంతాలపై నజర్

జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించిన పోలీస్ శాఖ.. నిఘా వర్గాలను అప్రమత్తం చేసింది. గొడవలు జరిగే ప్రాంతాలు, గొడవలను ప్రేరేపించే వారి వివరాలను సేకరించింది. అలాగే రౌడీ షీటర్ల వివరాలను, వారి ప్రవర్తనను అంచనా వేసి వారిని ముందస్తుగా బైండోవర్ చేయనున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. గతంలో ఎన్నికల సందర్భంగా ఘర్షణలు జరిగిన గ్రామాలను, ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను అంచనా వేస్తున్నారు. నిఘాను మరింత పటిష్టం చేయడానికి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని నిఘా వర్గాలను అప్రమత్తం చేశారు. ఎక్కడా గొడవలు జరగకుండా కట్టడి చేయడానికి పక్కాగా ముందుకు సాగుతున్నారు.

సరిహద్దు ప్రాంతాల పోలీసులు సహకరించాలి

బిచ్కుంద: తెలంగాణలో త్వరలో ఎన్నికలు జరగనున్నందున రాష్ట్ర సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక పోలీసు సిబ్బంది సహకారం అందించాలని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి కోరారు. బుధవారం బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది సమావేశమయ్యారు. ఎలక్షన్‌కు సంబంధించిన సమాచారం, చెక్‌పోస్టుల నిర్వహణ, అంతర్రాష్ట్ర దొంగల సమాచారం, హత్యలు ఇతర కేసుల్లో సహకారం అందించుకోవాలని నిర్ణయించామని డీఎస్పీ జగన్నాథరెడ్డి తెలపారు. సమావేశంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి, మహారాష్ట్రలోని దెగ్లూర్ సీఐ సంజయ్ హిబ్బరే, మర్కెల్ సీఐ, కర్ణాటకలోని ఔరాద్, చింతాకి ఎస్సైలు, బిచ్కుంద, బాన్సువాడ, సంగారెడ్డి, కంగ్టి, రుద్రూర్ సర్కిల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరుతూ ఈ–పంచాయతీ ఆపరేటర్లు బుధవారం జెడ్పీటీసీ ఉషాగౌడ్, డీఎల్పీవో సురేందర్‌లకు వినతిపత్రాలను అందించారు. అలాగే మహిళా ఆపరేటర్లకు ప్రసూతి సెలవులను మంజూరు చేయాలని కోరారు. ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం నాయకులు అనిల్, ప్రశాంత్, కపిల్ తదితరులున్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



కామారెడ్డి రూరల్: పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని 105 రోజులుగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం కామారెడ్డి డెయిరీ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, సురేందర్, శ్రీనివాస్, మాధవి, శైలజ, చందనలు పాల్గొన్నారు.

మోకాళ్లపై ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగుల సమ్మె బుధవారానికి 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం ద్వారా వైద్య శాఖలో విధులు నిర్వహిస్తున్న డీఈవోలు, స్టాఫ్ నర్సులు, ఎల్‌టీలు, సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టు తదితరులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.బాలరాజ్, ఎల్. దశరథ్, తదితరులున్నారు.

చెరువు కాలువ పరిశీలన



సదాశివనగర్: మండల కేంద్రంలో పాత చెరువు మొదలుకొని కొత్త చెరువు వరకు గల కాలువను బుధవారం ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ పరిశీలించారు. మండల కేంద్ర శివారులోని ఎస్సీ కాలనీలో పక్క నుంచి కాలువ ఉండడం వల్ల వర్షపు నీరు ఇళ్లలోకి వెళ్తోంది. ఈ విషయాన్ని సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు ఎమ్మెల్యే సురేందర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఆదేశాలతో సీఈ కాలువను పరిశీలించారు. ఇరువైపులా 2.4 కి.మి. కెనాల్, 430 మీటర్ల మేర సైడ్‌వాల్ నిర్మాణ పనులకోసం ప్రతిపాదనలు రూపొందించామన్నారు. అలాగే కొత్త చెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌కు కూడా ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, విండో చైర్మన్ కమలాకర్‌రావు, ఏఎంసీ చైర్మన్ వడ్ల రాజేందర్, ఇరిగేషన్ ఎస్‌ఈ విద్యావతి, ఈఈ మల్లేశం, డీఈ శాలిని, ఏఈ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇఫ్తాకర్, నాయకులు అశోక్ రెడ్డి, పెసరి సాయిలు, కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణానికి తప్పని తిప్పలు

- పలుచోట్ల కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు
- తాత్కాలిక రోడ్లు కొట్టుకుపోయి అవస్థలు



జుక్కల్‌లో తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు



తిమ్మనగర్ వద్ద కోతకు గురైన తాత్కాలిక రోడ్డు

నిజాంసాగర్(జుక్కల్): లో లెవల్ వంతెనలతో వరద తిప్పలకు శాశ్వత పరిష్కారం దిశగా హై లెవల్ వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. హై లెవల్ వంతెనలకు నిధులు మంజూరు చేయడంతో అధికారులు పనులపై దృష్టి సారించారు. అయితే వంతెన కోసం అంతకు ముందు ఉన్న రోడ్డును తొలగించారు. ఈ క్రమంలో తాత్కాలిక రోడ్లు వేశారు. అయితే వర్షం పడిన ప్రతి సారి తాత్కాలిక రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జుక్కల్ శివారులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని వాగు వద్ద హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. దీంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. వాగుపై పనులు చేపడుతుండటంతో ప్రయాణానికి ఆటంకం లేకుండా తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతంగా వస్తుండటంతో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దాంతో జుక్కల్ చౌరస్తా నుంచి జుక్కల్ మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు మార్గంలో ప్రయాణాలు నిలిచిపోయాయి. వరద ప్రవాహం తగ్గముఖం పట్టడంతో తాత్కాకంగా రోడ్డును ఏర్పాటు చేసి ప్రయాణానికి ఆటంకం కల్గకుండా తగు చర్యలు తీసుకున్నారు.

కామారెడ్డి, మెదక్ జిల్లాల సరిహద్దున నల్ల వాగు, కాకి వాగులు వర్షాకాలంలో వరద ప్రవాహాలు అధికం. ఆ వాగులపైన లోలెవల్ వంతెనలను వరద ముంచెత్తుతుండటంతో రెండు జిల్లాల సరిహద్దు మండలాలు కల్హేర్, పిట్లం మండలాలు, పలు గ్రామాలకు ప్రయాణాలు నిలుస్తున్నాయి. దీంతో తిమ్మానగర్ వద్ద నల్లవాగుపై హై లెవల్ వంతెనకు రూ. 4.8 కోట్లు, కాకివాగుపైన వంతెనకు రూ.3.15 కోట్లు మంజూరు చేశారు. పనులు కూడా మొదలయ్యాయి. ఈ వంతెన వద్ద వేసిన తాత్కాలిక రోడ్లు కూడా వర్షానికి కొట్టుకుపోయాయి. దీంతో కల్హేర్, పిట్లం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

లక్ష్యం నెరవేరాలంటే గట్టి ప్రయత్నం చేయాలి

- ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం



బహుమతులతో విద్యార్థులు, అధ్యాపకులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు టీచర్లుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం విద్యార్థుల బోధన తీరును పరిశీలించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే గట్టి ప్రయత్నం చేయాలని అప్పుడే జీవితంలో సక్సెస్ అవుతామని అన్నారు. బోధనలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ మధుశ్రీ వాత్సవ, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): పెంపకం దారులు గొర్రెలు, మేకలను పెంచుకొని మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో బుధవారం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొర్రెలు మేకల పెంపకం దారులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రాంచంద్రం, రవికుమార్, జిల్లా ప్రాజెక్టు అధికారి రమేష్ బాబు, రిలయన్స్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజు,ప్రతినిధులు, పెంపకందారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీనివార్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇస్తామని, అపరిచిత వ్యక్తుల నుంచి నగ్న వీడియో కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా, బ్యాంక్ ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలని కోరారు. ఓటీపీలను ఇతరులకు షేర్ చేయద్దన్నారు. అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ నేరానికి గురి అయితే వెంటనే www. cybercrime. gov. in ను లేక 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): వర్షాలకు దెబ్బతిన్న పంటల రక్షణకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని డీపీవో భాగ్యలక్ష్మి అన్నారు. సోమారం శివారులో వరి, మొక్కజొన్న, పత్తి, సోయా పంటలను ఆమె బుధవారం పరిశీలించారు. పంటలలో అధికంగా ఉన్న నీటిని వెంటనే తొలగించాలని సూచించారు. అధికారుల సలహా మేరకు మందులను పిచికారీ చేయాలని సూచించారు. సర్పంచ్ చరణ్ రెడ్డి, ఏఈవో లికిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ పార్థసారథి బుధవారం ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. కామారెడ్డికి వచ్చిన ఆయనకు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాసరెడ్డి, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో సమావేశమై ఎన్నికల ఏర్పాట్లు, తదితర అంశాలపై చర్చించారు. ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

- మూత్రవిసర్జన చేస్తుండగా ఫొటో తీసిన మహిళ
- భర్తతో పంచాయితీ పెట్టించడంతో మనస్తాపానికి గురై బలవన్మరణం



ప్రమోద్ (ఫైల్)

మాక్లూర్(ఆర్మూర్): ఓ మహిళ చేసిన ఆరోపణలతో అవమానాన్ని తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడో యువకుడు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామానికి చెందిన మేతరి ప్రమోద్(18) ఈనెల 4న తన ఇంటికి కొద్ది దూరంలో మూత్ర విసర్జన చేశాడు. సమీపంలో నివసించే ఓ మహిళ తన సెల్‌ఫోన్‌లో ఫొటోతీసి.. రోజు నన్ను చూస్తూనా ఎదుటే మూత్ర విసర్జన చేస్తున్నాడంటూ ఆ ఫొటోను భర్తకు చూపించింది. దీంతో ఆయన కుల పెద్దలతో పంచాయితీ పెట్టించాడు. తాను ఉద్దేశపూర్వకంగా అక్కడ మూత్ర విసర్జన చేయలేదని, వర్షం పడుతుండడంతో అలా చేశానని ప్రమోద్ చెప్పినా వినకుండా తీవ్రంగా మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రమోద్. అదే రోజు ఆర్మూర్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లి ఆర్మూర్ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని స్నేహితులకు ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పి నిప్పంటించుకున్నాడు. ప్రమోద్ స్నేహితులు ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులకు తెలిపి సంఘటన స్థలానికి వెళ్లేసరికి తీవ్రంగా గాయపడి ఉన్నాడు. వెంటనే అంబులెన్స్‌లో ఆర్మూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ప్రమోద్ తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం కాగా ప్రమోద్ చివరివాడు. తల్లి చిన్నప్పుడే మృతిచెందగా నాన్నే పెంచాడు. ప్రమోద్ ఇంటర్ పూర్తిచేసి ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ విషయమై ఆర్మూర్ సీఐ సురేష్‌బాబును వివరణ కోరగా కేసు నమోదు చేశామని, మాక్లూర్‌కు కేసును బదిలీ చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి హత్య

- వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కోపంతో..
- మంజీరాలో మృతదేహాన్ని పారేసిన నిందితుడు



శివకుమార్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కోపంతో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివకుమార్(45) అదృశ్యమైనట్లు అతని తండ్రి గంగారాం ఆగస్టు 20న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో గ్రామంలోని మసూద్‌పై అనుమానం రావడంతో పీఎస్‌లో విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. శివకుమార్ భార్యతో మసూద్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిపారు. దీంతో అడ్డుగా ఉన్న శివకుమార్‌ను హత్య చేసేందుకు పథకం రచించాడు. జూలై25న మద్యం తాగేందుకు ఇద్దరు బైక్‌పై మహారాష్ట్రలోని బిలోలి మండలం నాగిని శివారులోని ఉన్న మంజీరా సమీపంలో మద్యం తాగారు. పూర్తి మైకంలో ఉన్న శివకుమార్‌ను బండరాయితో తలపై మోది హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే మంజీరాలో పడేసినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శర్బతీకెనాల్ కాలనీలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ బుధవారం తెలిపారు. కాలనీలో యువకులు ఘర్షణకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించి నలుగురు యువకులు సయిాద్, యాసిన్, అమీర్, ఇర్ఫాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఘర్షణ ప్రేమ వ్యవహారంగా భావిస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారును ఢీకొన్న లారీ



ఘటనాస్థలిలో కారు

భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కారును లారీ ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొనడంతో మూడు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

బాలిక దత్తతపై విచారణ

అనారోగ్యం, పేదరికంతో విక్రయించినట్లు నిర్ధారణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ తన ఏడేళ్ల కూతురును రూ.30 వేలకు విక్రయించారంటూ బుధవారం సోషల్‌మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు పోలీసులతో కలిసి విచారణ చేపట్టారు. అధికారుల విచారణలో బాలికను దత్తత ఇచ్చిన మాట వాస్తమేనని, బాలిక తల్లి సైతం అనారోగ్యానికి గురికావడంతో రూ. 30 వేలకు తల్లి విక్రయించినట్లు తెలిసింది. మండల కేంద్రానికి చెందిన ఓ నిరుపేద మహిళకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా చిన్న కూతురు పుట్టిన 3 రోజులకే పెంచుకునేందుకు ఆమె సమీప బంధువులకు అప్పగించినట్లు తెలిసింది. కాగా ఏడేళ్ల వయసున్న పెద్ద కూతురును సుమారు 15రోజుల క్రితం లింగంపేట మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన దంపతులకు దత్తత ఇచ్చినట్లు తెలిసింది. బాలిక తల్లి ఆరోగ్యం బాగాలేకపోవడంతోపాటు పేదరికం కారణంగా దత్తత తీసుకున్న దంపతులు రూ.30వేలు ఇచ్చినట్లు సమాచారం. ఇందుకు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మధ్యవర్తిత్వం వహించినట్లు అధికారుల విచారణలో తేలింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి బుధవారం బాలికను దత్తత ఇచ్చిన మహిళ ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. విచారణ పూర్తయితే బాలికల దత్తతకు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ముదిరాజ్‌లకు టికెట్లు ఇవ్వని పార్టీలను బహిష్కరిస్తాం



మాట్లాడుతున్న అబ్రబోయిన స్వామి

కామారెడ్డి టౌన్: ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వకపోతే బీఆర్‌ఎస్ సహా ఏ పార్టీనైనా బహిష్కరిస్తామని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి అన్నారు. కామారెడ్డి పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లలో అసంతృప్తికి కారణం కేసీఆర్ మాత్రమేనన్నారు. తెలంగాణ ఉద్యమంలో మొట్టమొదటి అమరవీరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ అనే విషయాన్ని కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 మంది ముదిరాజ్‌లు చనిపోయారని గుర్తు చేశారు. అలాంటి తమకు ఒక్క టికెట్ కూడా ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. కామారెడ్డి నియోజకవర్గంలో 50 వేలు, ఎల్లారెడ్డిలో 70 వేలు, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో 40 వేల చొప్పున ముదిరాజ్‌లు ఉన్నారని, గెలుపోటములు శాసించే స్థాయిలో ఉన్న తమను పట్టించుకోని ఏ పార్టీ అయినా తాము బహిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8న కామారెడ్డిలో నిర్వహించే ముదిరాజ్ మేధావుల రౌండ్ టేబుల్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. నాయకులు సూర్యప్రసాద్ కాకర్ల శేఖర్, కిష్టయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



సదాశివనగర్‌లో గోపికలతో చిన్ని కృష్ణుడు

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు అలరించారు. అలాగే పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.



దోమకొండ: పాఠశాలలో ఉట్టికొడుతూ..



లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో..



జిల్లా కేంద్రంలో ఎస్పీఆర్ పాఠశాలలో..



బాన్సువాడలో..









ఆకస్మిక నిర్ణయాలు తీసుకోవడం మానుకోవాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బాన్సువాడ/కామారెడ్డిటౌన్: ఐచ్ఛిక, సాధారణ, విపత్కర సెలవులపై ప్రభుత్వం తీసుకుంటున్న ఆకస్మిక నిర్ణయాలను మానుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. బుధవారం బాన్సువాడలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన ఆకస్మిక సెలవుల కారణంగా సూర్యాపేట్‌లో ఉపాధ్యాయ దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయకుండా ముందస్తుగా సెలవులపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, మచ్చేందర్, సాయిలు, తదితరులున్నారు.

పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మి

ఎల్లారెడ్డి: గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ఎంపీవో ప్రకాష్, పంచాయతి కార్యదర్శులున్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఎంపీవో శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రతివార్డులో పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన నెట్‌బాల్ క్రీడాకారుల జట్లు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెన్, ఉమెన్ విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికలను నగరంలోని అభ్యాస స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వరకు నిర్మల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రమేశ్, కోశాధికారి గంగాధర్, సభ్యులు రాజేశ్వర్, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు. జట్టుకు మేనేజర్లుగా సునీల్, రమేశ్‌గౌడ్, కోచ్‌లు వెంకటేశ్వర్‌రావు, ఎ. రమేశ్ వ్యవహరించనున్నారు.

ఎంపికైన వారిలో..

అనిల్‌కుమార్, విజయకాంత్, స్వామి, నవీన్, ధనుష్, ప్రణయ్‌రెడ్డి, జగదీశ్, అజయ్‌కుమార్, శుశాంత్, శ్రావణ్, మధు, అరోణ్, మనితేజ, హరీశ్, శ్రావణి, లేయ, సుమయ్య, కార్తీక్, మహేశ్వరీ, రవీనా, మనస్వీ, సుహాణి, హరిణి, శ్రీజ, రిషిక, ప్రణవి, హేమశ్రీ, మహియ, త్రిశల్ ఎంపికయ్యారు.